కథ

# తల్లిదండ్రులా బహుపరాక్!

- సీతాసత్య

‘‘నువ్వు నాకు దొరకడాన్ని మించిన అదృష్టం లేదు నా జీవితంలో’’ అన్నాడు భార్గవ ఇందుమతిని దగ్గరకు తీసుకుంటూ.

‘‘రోజుకోసారి ఈ మాటనకపోతే రోజూ గడవదుగా మీకు! అయినా నేను మీకు దొరకడమేవిటి! మీరే నాకు దొరికిన అదృష్టం’’ అంది ఇందుమతి అతడినుంచి దూరంగా జరిగే ప్రయత్నం చేస్తూ.

‘‘ఈ విషయంలో మాత్రం నీతో నేను ఏకీభవించను’’ అన్నాడు భార్గవ.

‘‘మీరొప్పుకోనంత మాత్రాన నిజం నిజం కాకుండా పోతుందా? నా స్నేహితురాలు విజయను చూసుకుందుకొచ్చిన పెళ్ళికొడుకు స్నేహితుడిగా మీరొచ్చినప్పుడు మిమ్మల్నిచూసి ఇష్టపడి మీకు గేలంవేసి మా వాళ్ళను ఒప్పించి మిమ్మల్ని నా కొంగుకు కట్టుకున్నది నేనే కదా!’’



''అలాఅని నువ్వనుకుంటున్నావు. కానీ నా స్నేహితుడికి తోడుగా పెళ్ళిచూపుల కొచ్చినప్పుడు వాడు నీ స్నేహితురాల్నీ, ఇరుపక్షాల పెద్దలూ వాళ్ళిద్దర్నీ చూస్తోంటే పెళ్ళి చూపులేర్పాటు చేసిన హాలుకు వెనుక ఉన్న గది కిటికీలోంచి నువ్వు పెళ్ళిచూపులు తతంగాన్ని చూస్తోన్న సమయంలో నేను నిన్ను చూసి మనసు పారేసుకుని తర్వాత నువ్వు మీ పెద్దల ద్వారా నాతో పెళ్ళి రాయబారాలు నడిపించినప్పుడు నాకేవీ తెలియనట్టుగా నువ్వే నా వలలో వచ్చి పడేలా చేసుకున్నానని నేను చెప్పినా నువ్వు నమ్మకపోతే నేనేం చేయను?'' అన్నాడు భార్గవ అల్లరిగా.

''సరే... సరే.... మీరూ నేనూ ఇద్దరమూ అదృష్టవంతులమే! ఈ రోజు మనం మన అదృష్టాల గురించి కాక మనమ్మాయి హిమజ అదృష్టం గురించి మాట్లాడుకోవాలేమో అనిపిస్తోంది'' అంది ఇందుమతి.

కనుబొమ్మలెగరేస్తూ, ''హిమజ అదృష్టం గురించి ప్రత్యేకంగా మాట్లాడేందుకేం వుంది?! అదృష్టవంతులైన భార్యాభర్తలకు పుట్టిన పిల్లలు కూడా అదృష్టవంతులే అవుతారుగా!'' అన్నాడు భార్గవ ప్రశ్నార్థకంగా చూస్తూ.

''నేను మీలానే అనుకున్నాను నిన్నటివరకూ. కానీ నిన్న హిమజ గదిలో బీరువా సర్దుతోంటే దొరికిందిది. ఇతరుల డైరీలు చదవడం తప్పని తెలిసినా నా కన్న కూతురి డైరీ చదవడం ఘోరాపరాధమేమీ కాదని సరిపెట్టుకుని చదవడం మంచిదే అయిందనిపిస్తోంది. మీరు చదవండి. నా మాటల కర్థమేవిటో తెలుస్తుంది'' అంటూ అలమరలోంచి డైరీని తీసి భార్గవకు అందించింది ఇందుమతి.

భార్య చేతిలోంచి డైరీని అందుకుని తెరిచాడు భార్గవ.


***

జులై 8: ఈరోజు కావ్య, శృతి, నేనూ క్లాసు ఎగ్గొట్టి సినిమాకు వెళ్ళాం. సినిమా జరుగుతున్నంత సేపూ కావ్య, శృతి ఏదోఒకటి మాట్లాడుతూనే ఉన్నారు. వాళ్ళసలు సినిమా చూడ్డానికొచ్చారో, కబుర్లు చెప్పుకుందుకొచ్చారో నాకు అర్థం కాలేదు.

ఒకానొక సమయంలో మా వెనుక సీట్లో కూర్చున్న వాళ్ళు. 'బయటకు వెళ్ళి మాట్లాడుకోమని' వాళ్ళను విసుక్కున్నారు కూడా. కాస్సేపు గొంతు తగ్గించి మాట్లాడుకున్నా మళ్ళీ మామూలుగా మాట్లాడుకోవడం ప్రారంభించారు వాళ్ళు. చిత్రంగా వాళ్ళ మాటల్లో చూస్తోన్న సినిమాకు సంబంధించిన మాటలు తక్కువా. ఇతర విషయాలు ఎక్కువా వినిపించాయ నాకు.

ఆ ఇతర విషయాల్లో ప్రధాన పాత్రధారులు – వాళ్ళ అమ్మా నాన్నలే! కావ్య వాళ్ళ నాన్న ఇంటికొస్తాడంటేనే వాళ్ళమ్మకు భయమట. కోపం వస్తే నోటికేది వస్తే అది మాట్లాడి చేతికేది అందితే దాన్ని విసిరేస్తాడట.

ఇహ... శృతి విషయానికొస్తే మెలకువగా ఉన్న ప్రతి క్షణమూ తన గురించే తప్ప పక్క వాళ్ళ గురించి ఏనాడూ ఆలోచించదట వాళ్ళమ్మ. శృతి ఒక్కతే ఆవిడకు సంతానమైనా ఎవరో పరాయి మనిషితో ఒక ఇంట్లో ఉంటున్నట్టు ఉంటుంది ఆవిడ. ఎంత సేపూ తన షోకులూ, సంఘసేవా కార్యక్రమాలూ, సభలూ, సమావేశాలతో నిత్యమూ తీరిక లేకుండా ఉంటుందట.



వాళ్ళ మాటలు వింటోంటే నా పరిస్థితికి సంతోషమూ, వాళ్ళపట్ల జాలీ కలిగాయి నాకు ఏక కాలంలో. కన్నబిడ్డల్ని ప్రేమగా చూసుకోని వాళ్ళసలు పిల్లలకెందుకు జన్మ ఇస్తారో?!

*ఆగస్ట్-1:*

ఈ రోజు నాన్నగారి పుట్టినరోజు. టూర్‌లో ఉన్న నాన్నగారికి శుభాకాంక్షలు తెలియచేశాను ఉదయాన్నే. నేను కాలేజీనుంచి ఇంటికొచ్చేసరికి టూర్ నుంచి ఎప్పుడు తిరిగొచ్చారో గానీ నాన్నగారు వంటింట్లో అమ్మకు సాయం చేస్తున్నారు.

లావుగా, పొడుగ్గా ఉన్న పచ్చిమిరపకాయలకు మధ్యలో గాటుపెట్టి నిమ్మరసం కలిపిన వాముని అందులో కూరి ఓ పళ్ళెంలో ఉంచుతోంటే అమ్మవాటిని అందుకుని శెనగపిండిలో ముంచి బాణలిలో మరుగుతోన్న నూనెలో వేస్తోంది. నాకెంతో ముచ్చటనిపించింది ఆ దృశ్యం చూస్తోంటే.

మొగుడూ, పెళ్ళాలిద్దరూ ఉద్యోగస్తులైన సందర్భాల్లో కూడా భర్తలు, భార్యలకు ఎటువంటి సహాయం చేయకుండా దర్జా ఒలకబోస్తుంటారని అక్కడక్కడా విన్నాను, చదివాను కూడా.

కానీ అమ్మ గృహిణే అయినప్పటికీ, పగలంతా ఉద్యోగరీత్యా బయటతిరిగి అలసిపోయి ఇంటికి వచ్చిన నాన్నగారు ఏ మాత్రం విసుగనేది లేకుండా అమ్మకు సాయపడడం చూస్తే ఎప్పటికప్పుడే నాకెంతో ముచ్చటగా ఉంటుంది.

*ఆగస్ట్ 5:*

'ఓ చోటికి వెళదాం. వస్తావా?' అని అడిగింది కావ్య నన్నీరోజు.

నేను సమాధానం చెప్పేలోగా శృతి అంది., ''అది మనతో రాదే! నాకు బాగా తెలుసు''

నేను ప్రశ్నార్థకంగా కావ్య వైపు చూశాను.

'ఏం లేదే... మేం సాయంత్రం ఓ చోటికి వెళ్దామనుకుంటున్నాం. తిరిగి ఇంటికి వెళ్ళేసరికి ఆలస్యం కావచ్చు. అందుకే అలా అంటోంది శృతి' అంది కావ్య సర్ది చెపుతున్నట్టుగా.

''నేను రానని ఎందుకనుకుంటున్నారు? ఒక్క రోజు ఇంటికి వెళ్ళడం ఆలస్యమైతే ఏం ఫర్వాలేదులే!'' అన్నాను నేను శృతి వైపు చూస్తూ.

శృతి ఓసారి భుజాలెగరేసి అంది. 'మాకైతే మేము ఎప్పుడు ఇంటికి వెళ్ళినా పట్టించుకునే వాళ్ళెవరూ లేరు. నువ్వు వేళతప్పి ఇంటికివెళ్తే నీకు ఇబ్బందేమోనని అలా అన్నానుట.

'మీరు వెళ్ళకూడని చోటుకేమీ వెళ్ళబోవడం లేదు కదా! ఆ మాత్రం దానికి తర్జన భర్జన లెందుకూ? పదండి. మా అమ్మకు ఫోన్‌చేసి చెప్తాను కాస్త ఆలస్యంగా వస్తానని' అన్నాను.

కావ్య, శృతి ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

'సరే పద.... నువ్వొస్తానంటే మా కంతకంటే ఏం కావాలి?!' అంది శృతి.

తీరావెళ్ళాక అనిపించింది నాకు. వాళ్ళతో ఎందుకు వెళ్ళానా? అని మేం కాలేజీకి దూరంగా

ఉన్న పార్కుకు వెళ్ళేసరికి అక్కడ ఇద్దరు యువకులు కనిపించారు.

కావ్యనూ, శృతినీ చూడగానే వాళ్ళు నవ్వుమొహాలతో ఎదురొచ్చి స్వాగతం పలికారు. ఒక యువకుడి పేరు సాగర్. మరొకతని పేరు సంపత్.

మేం అయిదుగురం. ఆ పార్కులో గుబురుగా ఉన్న ఒక చెట్టుక్రింద కూర్చున్నాం. అయిదు నిముషాల్లో పలకరింపు మాటలై పోయాక ఇబ్బంది కరమైన వాతావరణం ఏర్పడిందక్కడ.

కావ్య సాగర్‌వైపూ, శృతి సంపత్ వైపూ చూడడమూ, వాళ్ళు నలుగురు నా వైపు చూడడంతో నా కర్థమైంది. నేనక్కడుండడం వాళ్ళు నలుగురికీ ఇబ్బందిగా ఉందని.

నేనే లేచి నిలబడి 'వస్తాను కావ్యా, వస్తాను శృతీ!' అని ఆ యువకులిద్దరి వైపూ చూసి మొహమాటంగా నవ్వి అక్కడి నుంచి బయట పడ్డాను.

అక్కడినుంచి తిరిగి ఇంటికి వచ్చేవరకూ నా గుండె చప్పుడు నాకే వినిపించేంత వేగంగా నా గుండె కొట్టుకుంది. కావ్య, శృతీ ఇంట్లో వాళ్ళకు తెలియకుండా ఆ యువకులతో స్నేహం చేయడం తలచుకుంటేనే నాకు అదోలా ఉంది.

వివరంగా ఆలోచించగా భయం కూడా వేసింది. ఇంకెప్పుడూ వాళ్ళిద్దరితోనూ ఎక్కడికీ వెళ్ళకూడదని ఒట్టు పెట్టుకున్నాక గానీ నా మనసు కుదుట పడలేదు.

**సెప్టెంబరు 8:**

ఈరోజు ఇంటికొచ్చే సరికి పడక గదిలో అమ్మ మంచం మీద పడుకుని ఉంది. నాన్నగారు అమ్మపక్కనే మంచం మీద కూర్చున్నారు. మంచం పక్కనే ఉన్న బల్లమీద జండూ బామ్ సీసా ఉంది. అమ్మ వీపు మీద చేతివ్రేళ్ళతో వత్తి రాస్తూ.. 'తగ్గిపోతుంది... అయిదు నిముషాలు ఓపికపట్టు. తర్వాత నువ్వే టీవీలో చూపించినట్టు – ఇట్స్‌గాన్ – అంటూ లేచి కూర్చుంటావ్!' అంటున్నారు నాన్నగారు.

'చాల్లే.. ఊరుకోండి... హిమజ వచ్చే సమయమౌతోంది. మనిద్దర్నీ ఇలాచూస్తే ఏఁవనుకుంటుంది?' అంటోంది అమ్మ చిరుకోపంగా.

నాన్న చేస్తోన్న పనికి లోలోన మురిసిపోతూ పైకి మాత్రం అలా అంటోందని కళ్ళూ, చెవులూ ఉన్నవారికెవరికైనా తేలిగ్గా అర్థమౌతుంది. నాకూ అలానే అర్థమైంది.

'అదేవిటి ఇందూ... నేనేమైనా కాని పని చేస్తున్నానా? నాకోసం రెక్కలు ముక్కలు చేసుకుని ఇంటెడు చాకిరీ చేస్తోన్న నీకు నడుం నొప్పి వస్తే ఈ మాత్రం చేయడం కూడా గొప్పేనా?

అయినా హిమజ చూస్తే మాత్రం ఏఁవనుకుంటుంది? రేపు దానికి పెళ్ళయ్యాక వాళ్ళాయన మాత్రం దాని కవసరమైనప్పుడు ఈ మాత్రం చేయడూ?' అంటున్నారు నాన్నగారు.

'నామాట మీరెప్పుడు ఒప్పుకున్నారు కనుకా... అయినా నా నడుం నొప్పి ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయింది. హిమజ మనల్నిలా చూస్తే బావుండదు. లేవండి' అంటూ మంచం దిగిపోయింది అమ్మ.

నేను వాళ్ళిద్దరికంట పడకుండా ఏ మాత్రం చప్పుడు చేయకుండా వీధి గుమ్మం వరకూ నడిచి వెళ్ళి అప్పుడే ఇంటికొచ్చినట్టుగా 'అమ్మా...' అని పిలుస్తూ తిరిగి లోపలికి అడుగులు వేశాను.

**సెప్టెంబరు 15:**

కెమిస్ట్రీ లెక్చరర్ సెలవు పెట్టడంతో సెకండ్ అవర్ ఖాళీగా ఉండి కాలక్షేపం కోసం కాలేజీ క్యాంటీన్‌కు వెళ్ళాను. టోకెన్ తీసుకుని కౌంటర్ దగ్గరకు వెళ్ళి కాఫీ తెచ్చుకుని ఖాళీగా ఉన్న టేబిల్ చూసుకుని కూర్చున్నాను.

కాస్సేపటికి... ఇంకెక్కడా చోటు లేనట్టు కావ్య, శృతి వచ్చి నేను కూర్చున్న టేబిల్ చుట్టూ ఉన్న కుర్చీల్లో కూర్చున్నారు.

'మమ్మల్ని పిలవకుండా వచ్చేశావేం?' అంది శృతి.

నేనేదో చెప్పేలోగా 'అది మనల్నెందుకు పిలుస్తుందే! మనం సాగర్, సంపత్‌లతో స్నేహం చేస్తున్నామని తెలిసినప్పటి నుంచీ మనల్ని తప్పించుకుని తిరుగుతోంది' అంది కావ్య నిష్ఠూరాన్ని కంఠంలో ధ్వనింపచేస్తూ.

'అబ్బే... అదేం లేదే!' అన్నాను. నా మనసులోని విషయాన్ని అంతసరిగ్గా బయట పెట్టిన కావ్య ఊహాశక్తికి ఆశ్చర్యపోతూ.

'పోనీలే... ఎవరిష్టం వాళ్ళది. అయినా సాగర్ అననే అన్నాడు. మీ స్నేహితు రాలికి ఆడవాళ్ళతోనే తప్ప మగవాళ్ళతో ఇష్టం లేనట్టుగా ఉందని' అంది శృతి.

ఆ రోజు నేను వాళ్ళను పార్కులో వదిలేసి వెళ్ళిపోయిన తర్వాత వారి సంభాషణల్లో నా ప్రస్తావన చోటు చేసుకుందని తెలిసి ఉలిక్కిపడ్డాను.

నా గురించి వాళ్ళింకా ఏం మాట్లాడుకున్నారో తెల్సుకుంటే బావుణ్ణనిపించింది. కానీ అదే విషయం అడగాలంటే మొహమాటం అడ్డొచ్చింది.

నా మనసులో మాట చదివినట్టుగా అంది కావ్య.

'వయసులో ఉన్న ఆడపిల్ల తన ఈడున్న యువకులతో కాకుండా యువతులతో స్నేహాన్ని ఇష్టపడుతోందంటే ఆ అమ్మాయిలో ఏదో లోపమున్నట్టేనని సంపత్ కూడా అన్నాడుగా!'

కావ్య మాటలు వింటొంటే ఎవరో చెళ్ళున నా చెంప మీద చరిచినట్టనిపించింది. ఆ వెనువెంటనే ఉక్రోషమూ వచ్చింది నాకు. నా గురించి ఏం తెలుసు వీళ్ళకి?!

నాతో అయిదు నిముషాలు మాట్లాడినంతలో నా మనస్తత్వం గురించి తెల్సి పోయిందా? అయినా నా గురించి ఏఁవనుకుంటున్నారు వీళ్ళందరూ?!

నా ఆలోచనల్లో నేనుండగా ఎప్పుడొచ్చారోగానీ సాగర్, సంపత్‌లు వచ్చి దగ్గరగా ఉన్న కుర్చీల్ని లాక్కుని మేము కూర్చున్న టేబిల్ చుట్టూ కూర్చున్నారు.

నేను తలెత్తి చూసేసరికి సంపత్ నా కళ్ళలోకి చూస్తూ అన్నాడు. 'మేం వచ్చామని నువ్వు వెళ్ళిపోవద్దు దయచేసి. మేం రావడం నీ కిష్టం లేకపోతే మొహమాట పడకుండా చెప్పేయ్! వెళ్ళిపోతాం'

గతంలో నా గురించి అతడు చేసిన వ్యాఖ్యానాన్ని ఒక్కక్షణం క్రితం శృతి నుంచి విన్న నాకు మళ్ళీ కోపం వచ్చింది.

దాంతో అప్రయత్నంగా, 'ఏం... మీ గర్ల్‌ఫ్రెండ్స్‌తో తప్ప ఇతర అమ్మాయిలతో మాట్లాడ్డమంటే మీకు భయమా?' అన్నాను.

అలా అన్నవెంటనే నేనేం మాట్లాడానో అర్థమై నాలిక్కరుచుకుని 'సారీ..?' అన్నాను.



సాగర్ కళ్ళెగరేస్తూ 'మీకు కోపఁవొచ్చినట్టుంది. కూల్‌డ్రింక్ తెప్పించమంటారా? కాస్త ఒళ్ళు చల్లబడి కోపం తగ్గుతుందేమో!' అన్నాడు నన్ను తేరిపార చూస్తూ.

వాళ్ళు నలుగురూ తమ సత్కాలక్షేపానికి నన్నోపావులా భావిస్తున్నారని అర్థం కావడంతో అతడివైపు తీక్షణంగా చూస్తూ విసురుగా లేచి విసవిసా నడుచుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాను.

**నవంబరు 7:**

ఉదయాన్నే అమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్దామని నేను లేచేసరికి... అమ్మా, నాన్నగారూ ఎప్పుడు లేచి పనులన్నీ పూర్తి చేసుకున్నారో గానీ డైనింగ్ టేబిల్‌దగ్గర కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ దృశ్యం ఎంతో

## నయనతార, షీలా... ఎవరు ఎక్కువ?

ఈ ప్రశ్న వచ్చినప్పుడు కచ్చితంగా నయనతారే ఎక్కువ అని చాలా మంది అంటారు. ఎందుకంటే షీలా కంటే నయనతార సీనియర్. షీలా నిన్న మొన్న వస్తే నయనతార ఎప్పటి నుంచో ఫీల్డ్‌లో ఉంది. మరి అలాంటప్పుడు షీలా కన్నా నయనతారకే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి కదా? కానీ... 'అదుర్స్' ప్రమోషన్ వర్క్‌లో అలా జరగలేదు. జూనియర్ ఎన్టీఆర్ సరసన ఈ ఇద్దరూ నటించారు. సినిమా పబ్లిసిటీలో నయనతారను దాదాపు పక్కన పెట్టి షీలాను ఎక్కువగా ప్రమోట్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని మీద దర్శక నిర్మాతలు, హీరో, హీరోయిన్లు ఎవ్వరూ నోరు మెదపకపోయినా, నయనతారను పక్కన పెట్టారని పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ సినిమాతో నయనతార పరిస్థితి ఎలా ఉన్నా, షీలా దశ మాత్రం తిరిగిందని వారు అంటున్నారు. నయనతారకున్న స్టార్‌డమ్‌ను షీలా కొట్టేసిందన్నది వారి వాదన.

మనోహరంగా కనిపించింది నాకు.

నేను చూస్తోండగానే అమ్మనుదుటి మీది చెమటను నాన్నగారు తన చూపుడు వ్రేలితో తుడవబోతోంటే అమ్మతల పక్కకు తిప్పుకుంటూ, 'ష్... ఏంవిటిది! పట్ట పగలు హఠాత్తుగా హిమజవచ్చి చూస్తే ఏమనుకుంటుంది?' అంది చిరుకోపాన్నభినయిస్తూ.

నాన్నగారు నవ్వుతూ, 'నేనేంవైనా కానిపని చేస్తున్నానా మేడమ్! ముందుముందు పెళ్ళయి భర్తతో కాపురం చేయబోయే హిమజ మనిద్దర్నీ ఇలాచూస్తే మరీ మంచిది. కాదంటావా?' అన్నారు.

'మీతో వాదించి నెగ్గడం నా వల్లకాదు గానీ... వయసొచ్చిన ఆడపిల్ల కంట పడేలా ఇటువంటి చేష్టలు చేయడం మంచిది కాదని మాత్రం చెప్పగలను' అంది అమ్మ.

'అదేంవిటోయ్... ఇప్పుడే పుట్టిన పాపాయివి కదా.... అందునా పొద్దుటి నుంచీ పని చేసి చేసి అలసిపోయి మరీ అందంగా కనిపిస్తున్నావని ఉండబట్టలేక. ఒంటి మీద చేయివేయబోయాను. నీ కిష్టం లేకపోతే సరేలే..' అంటూ నాన్నగారు బుంగమూతిపెట్టి చేయి వెనక్కు తీసుకోబోయారు.

అమ్మనాన్నగారి చేతిని పట్టుకుని తన చెంపమీద ఉంచుకుని మురిపెంగా చూస్తూ, 'మాటల్తో బురిడీ కొట్టించడంలో ఎవరైనా మీ తర్వాతే! ఇహ లేవండి... హిమజ లేచిందేమో చూద్దాం' అని లేచి నిలబడడం చూసి చప్పుడు కాకుండా నా గదిలోకి పరిగెత్తి దుప్పట్లో దూరిపోయాను.

**నవంబరు 14:**

నిన్నటితో టీనేజ్ దాటిపోయింది నాకు. ఈరోజు అమ్మా, నాన్న చేసిన హడావుడి అంతా ఇంతాకాదు. నా ప్రతి పుట్టినరోజునూ కొత్తగా నాకు కలకాలం గుర్తుండి పోయేలా ఎంతో శ్రద్ధ తీసుకుని జరుపుతారు అమ్మా, నాన్న.

వచ్చే సంవత్సరం నా పుట్టినరోజు అమ్మా నాన్నల దగ్గరే జరుపుకుంటానో లేక అమ్మా నాన్నలు నా కోసం ఎంపిక చేసిన వ్యక్తి సమక్షంలో జరుపుకుంటానో?! తలచుకుంటేనే మనసుకు ఎంతో ఉల్లాసంగా ఉంది.

నా పెళ్ళయిన తర్వాత కూడా మా ఆయనతో కలిసి పుట్టింటికొచ్చి నా ప్రతి పుట్టినరోజునూ ఇక్కడే జరుపుకోవాలి. పెళ్ళి చూపుల్లోనే నా మనసులోని ఉద్దేశ్యం స్పష్టంగా చెప్పేస్తాను పెళ్ళికొడుక్కి. అందుకు ఇష్టమైతేనే పెళ్ళికి ఒప్పుకుంటానని చెప్తాను. తనకిష్టమైతే చేసుకుంటాడు. లేకపోతే లేదు. అంతే!

**ఫిబ్రవరి 11:**

కావ్య, శృతి ఇంచుమించు రెండ్రోజులకోసారి సాగర్, సంపత్‌లతో ఎక్కడో ఒక చోట తరచూ కనిపిస్తున్నారు నాకు. వాళ్ళలా కనిపించినప్పుడల్లా నాకెందుకో అసహనంగా ఉంటోంది.

దానికి తగ్గట్టు ఈ మధ్య అమ్మా,నాన్న నన్నసలు పట్టించుకోవడం లేదేమో అనిపిస్తోంది. నేను ఎదురుగా ఉన్నప్పుడు నన్ను ప్రేమగానే చూసుకొంటోన్నా నేను కాస్త కనుమరుగు కాగానే కొత్తగా ప్రేమించుకున్న వాళ్ళలా ఒకరి పట్ల మరొకరు ప్రేమను మాటల ద్వారానూ, చేష్టల ద్వారానూ మరీ అతిగా వ్యక్తం చేసుకుంటున్నారేమో అనిపిస్తోంది నాకు.

అమ్మా, నాన్నా అలా ఒకరికోసం మరొకరున్నట్టుగా ఉండడం నా కిష్టమే. అయినా నాకెందుకో ఈ మధ్య నేను ఒంటరి దాన్ననే భావన తరచూ కలుగు తోంది.

ఏంచేయాలో అర్థం కావడం లేదు. ఆలోచించగా... కావ్య, శృతి, సాగర్ సంపత్‌లతో చనువుగా ఉండడంలో తప్పులేదేమో అనిపిస్తోంది. మా ఇంట్లో ఉన్న వాతావరణం వాళ్ళ ఇళ్ళల్లో లేకపోయినా, వాళ్ళూ నాలాగే ఒక రకమైన ఒంటరితనాన్ని దూరం చేసుకుందుకే సాగర్, సంపత్‌లకు దగ్గరయ్యారేమో అనిపిస్తోంది.

కాకపోతే వాళ్ళది ప్రేమరాహిత్యం వల్ల జనించిన ఒంటరితనమైతే నాదందుకు భిన్నం. నేనేం చేయాలి?! వాళ్ళలానే నేనూ ఎవరో ఒకరికి దగ్గర కావాలా?!

ఆ ఆలోచన మనసులోకి వస్తేనే భయంగానూ, ఆందోళనగానూ ఉంది. ఇదివరకు లేని పిచ్చి పిచ్చి ఆలోచనలెందుకొస్తున్నాయిప్పుడు నాకు? నా స్నేహితురాళ్ళ ప్రభావం నాకు తెలియకుండానే నా మీద పడిందా?!

లేక అమ్మా నాన్నల ప్రేమపట్ల నాలో నాకే తెలియని అసూయ జనించిందా? లేదూ... అమ్మను ప్రేమించిన దానికంటే మిన్నగా నన్ను ప్రేమించే వ్యక్తి నాకు దొరుకుతాడో, దొరకడో అని నా మనసు సంశయిస్తోందా?!

ఎటూ తేల్చుకోలేక పోతున్నాను.

***

తరువాతి పేజీలు ఖాళీగా ఉన్న డైరీని అంతవరకూ చదివి, "వయసొచ్చిన అమ్మాయి ఇంట్లో ఉందనే స్పృహ లేకుండా మనం కొత్తగా ప్రేమించుకున్న వాళ్ళలా ప్రవర్తించడం ఎంత తప్పో ఇప్పుడు నా కర్థమౌతోంది'' అన్నాడు భార్గవ.

"ఆయా సందర్భాల్లో మిమ్మల్ని తప్పు పట్టాలని కాక స్త్రీ సహజమైన ధోరణితో మాట వరసకు మిమ్మల్ని వారించేదాన్నే తప్ప తనకు తెలిసే విధంగా మనం చనువుగా ఉండడం వల్ల తన మనసులో ఈ విధమైన కొత్త కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని నేనూ ఊహించలేదు నిజం చెప్పాలంటే'' అంది ఇందుమతి.

"తను ఇంట్లో ఉన్న సందర్భాల్లో నేనూ కొంచెం హద్దుల్లో ఉండవలసింది. ఇంట్లో ప్రేమరాహిత్య వాతావరణమున్న సందర్భాల్లో వయసులో ఉన్న యువతీ యువకులు తమకు అందుబాటులో కాస్త దగ్గరగా ఉన్న వారి వైపు ఆకర్షింపబడతారని విన్నాం, చదివాం, చూస్తున్నాం.

కానీ నిత్య ప్రేమికుల్లా అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండే వారి పిల్లలు కూడా ఇటువంటి మాయలో పడే అవకాశముందని అనుకోవాలంటేనే ఆశ్చర్యకరంగానూ నమ్మశక్యం కాకుండానూ ఉంది'' అన్నాడు భార్గవ సాలోచనగా.

తలపంకిస్తూ అంది ఇందుమతి, "పిల్లలు మన ప్రేమకు ప్రతిరూపాలు. వాళ్ళ సమక్షంలో సాధ్యమైనంతవరకూ... ఈ లోకంలో అందరికంటే వాళ్ళే మనకు ఎక్కువ అనే విధంగా నడుచుకోవాలి.

అందుకు విరుద్ధంగా వారి సమక్షంలో మన పరస్పరప్రేమ వ్యక్తీకరణకు ఎక్కువ ప్రాధాన్యమిస్తే... మనం వాళ్ళను నిర్లక్ష్యం చేస్తున్నామని భావించి బయటి వాళ్ళలో ప్రేమను వెదుక్కునే ప్రయత్నం చేసే అవకాశం ఉంది.

అందుకు నిదర్శనం తన స్నేహితురాళ్ళు కావ్య, శృతి ఇద్దరు యువకులతో స్నేహం చేయడాన్ని మొదట్లో ఇష్టపడని హిమజ ఇప్పుడు తనూ వాళ్ళలానే పెళ్ళికి ముందు ఒక సమవయస్కుడి తోడు కోరుకోవడం తప్పుకాదేమో అనే అభిప్రాయానికి రావడమే!

పిల్లలకు పెళ్ళిళ్ళయి వారి జీవితానికి ఒక తోడు దొరికాక వాళ్ళ ఎదురుగా మనం మళ్ళీ ఇలానో, ఇంతకంటే ఎక్కువగానో ప్రేమగా ఉంటే వాళ్ళు మనఃస్ఫూర్తిగా సంతోషిస్తారు.


అంతవరకూ... అంటే వాళ్ళు మనమీద మానసికంగా ఆధారపడినంతవరకూ వాళ్ళే మన లోకం అనేలా ప్రవర్తించడం మన కనీస బాధ్యత''

"అవును.. తన మనసులోని భావాల్ని యధాతథంగా కాగితం మీద పెట్టడం ద్వారా మనకు మేలుచేయడమే కాకుండా తనకూ మనం మేలు చేసే అవకాశాన్ని కల్పించింది హిమజ.

ఇహముందు తనకు పెళ్ళయ్యేవరకూ 'తన తర్వాతే మనిద్దరం ఒకరి కొకరం' అనేభావన తనకు కలిగేలా ప్రవర్తించాలి. మన ప్రవర్తనలోని మార్పు హఠాత్తుగా వచ్చినట్టు కాకుండా చాలా సహజంగా జరిగినట్టు తను భావించేలా చాలాచాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

ఈ డైరీని ఎక్కడ తీశావో అక్కడే భద్రంగా ఉంచు'' అన్నాడు భార్గవ తేలిక పడిన మనసుతో.

*




చిరునామా :
కె.వి.వి.ఎస్.రాజు,
సీనియర్ లైజన్ ఆఫీసర్, కాఫీబోర్డ్,
మినుములూరు - 531 024